క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్ఆర్ఎం విభాగం అధిపతిగా ఆ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ వెంకట్, బీఓఎస్ కృష్ణ, అధ్యాపకులు శాలువా కప్పి సన్మానించి పూల మొక్కను అందజేశారు.

మంత్రిని కలిసిన 'కుడా' చైర్మన్



నయీంనగర్ : ఇటీవల కార్మిక, మైనింగ్, ఎంప్లాయిమెంట్ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మంత్రి గడ్డం వివేక్‌ను మంగళవారం ఆయన చాంబర్‌లో 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కురుమ సంఘం అధ్యక్షుడిగా కోటేశ్వరరావు

హన్మకొండ కల్చరల్ : మయూరి ఆర్ట్ క్రియేషన్ అధ్యక్షుడు ఏరా కోటేశ్వరరావు కురుమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మంగళవారం మయూరి ఆర్ట్ క్రియేషన్ కార్యవర్గం ఉపాధ్యక్షుడు ఆకుతోట లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోటేశ్వరరావును, తన కుమారుడు నవీన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సత్యం, భిక్షపతి, ప్రసాద్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 16న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ప్రకాష్‌రెడ్డి పేట, పోస్టల్ కాలనీ, పోలీసు కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు.అబ్బనికుంట యాకూబ్‌పుర, టీఆర్టీ కాలనీ, ఎస్ఆర్టీ కాలనీ, జాన్ పీరీలు, 100 ఫీట్ల రోడ్, అల్పాహారం, నర్సంపేట మెయిన్ రోడ్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం



సభ్యత్వ నమోదు చేయిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మడికొండ : టీఎస్ పీఆర్‌టీయూ కాజీపేట మండల శాఖ ఆధ్వర్యంలో మడికొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫలితాశ్రీహరి హాజరై మాట్లాడుతూ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి నాయకత్వంలో ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు శ్రీదేవిరెడ్డి, మాలకొండరెడ్డి, ప్రధాన కార్యదర్శి జై వీరప్రతాప్, రాష్ట్ర బాధ్యులు భాస్కర్ గౌడ్, పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



మడికొండ : కాజీపేట మండలం మడికొండలోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యుత్ ఉద్యోగులు, ఇతరులు కలిసి 250 మందికి నోట్‌బుక్స్, కొత్తగా పాఠశాలలో చేరిన పిల్లలకు బ్యాగులను, స్టేషనరీని అందజేశారు. అనంతరం హెచ్.ఎం మల్లారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వీ. జాన్సన్ పాల్గొని మాట్లాడుతూ ప్రతీ విద్యాసంవత్సరం ఒక ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసుకొని వారికి కావల్సిన బ్యాగులను, స్టేషనరీని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోజ్‌కుమార్, టీఎస్ ఎన్పీడీసీఎల్ రిటైర్డ్ అకౌంట్స్ అధికారి భిక్షపతి, సంతోష్, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ వెంకటనారాయణ, అనుదీప్, నరేంద్రపాల్, రామూర్తి, సత్యనారాయణ, తరుణ్, ఎస్సై రాం మోహన్, జయరాజ్, పాఠశాల చైర్‌పర్సన్ అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం

- ప్రమాదాలకు నిలయంగా ధర్మసాగర్–మడికొండ రోడ్డు
- వాహనాలు రాకుండా చర్య తీసుకోవాలని స్థానికుల వేడుకోలు



ప్రభుత్వ పాఠశాల ముందు రోడ్డుపై గుంతలు

మడికొండ : భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ధర్మసాగర్–మడికొండ రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రతీ రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొన్ని నెలల ముందు భారీ వాహనాలు రాకుండా పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినా వాహనాలు వాటిని ఢీకొంటూ వెళ్తున్నాయి. ముందుగా భారీ వాహనదారులకు అవగాహన కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు.

వాహనదారులకు తప్పని తిప్పలు

భారీవాహనాల రాకపోకలతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనికి తోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు ఉన్న శ్రీకృష్ణ హార్డ్‌వేర్ షాపునకు అధికలోడుతో వస్తున్న లారీలు రావడంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. షాపు ఎదుట తరచూ భారీ వాహనాలు రావడంతో రోడ్డు మొత్తం ఇరుకుగా ఉంటుంది. పోలీసులు షాపు వద్ద వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. పాఠశాల సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం వేళలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అవగాహన కల్పించాలి



వాహనదారులకు అవగాహన కల్పించి మడికొండ లో పలికి భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలి. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వాహనాలు రాకుండా చూడాలని పోలీసు వారిని ఆదేశిస్తున్నాం.

– అరవింద్, స్థానికుడు

వాహనాలు నిలపొద్దు



వాహనాలు రావడం ద్వారా రోడ్లు పూర్తిగా దెబ్బతిని ప్రయాణానికి తీవ్ర ఇబ్బందిగా మారుతుంది. ప్రభుత్వ పాఠశాల ముందు రోడ్డు ఇరుకుగా ఉండటంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది.

– పొనగోటి వెంకట్‌రావు,స్థానికుడు

ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు ప్రారంభించాలి

- కేయూ ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్



మాట్లాడుతున్న డాక్టర్ వలీఉల్లాఖాద్రి

కేయూ క్యాంపస్: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కాకతీయ యూనివర్సిటీలోనే ఏర్పాటు చేయాలని ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించాలని కేయూ వివిధ విద్యార్థి సంఘాల ఐక్యకార్యచరణ సమితి డిమాండ్ చేసింది. మంగళవారం యూనివర్సిటీలో నిర్వహించిన ఆ ఐక్యకార్యాచరణ సమితి సమావేశంలో వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో తీసుకొస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను కేయూలోని సీఆర్‌పీఎస్ క్యాంపు కార్యాలయం స్థలంలోనే ఈ స్కూల్‌ను నిర్మించాలన్నారు. యూనివర్సిటీ టీచింగ్ , నాన్‌టీచింగ్ ఉద్యోగులకు పిల్లలకు, స్కాలర్స్ పిల్లలకు ఎంతశాతం సీట్లు ఇవ్వాలనే దానిపై త్వరలోనే విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజాసంఘాలు, మేధావులతో చర్చా కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డాక్టర్ వలీ ఉల్లాఖాద్రీ, డాక్టర్ రాజునాయక్, వినోద్‌లోక్‌నాయక్, కుమార్, మనోహర్, నాగరాజు, ప్రదీప్, సుమన్, వంశీకృష్ణ, కార్తిక్, రాహుల్ పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని సీపీకి వినతి

హసన్‌పర్తి : మాజీ మావోయిస్ట్, జనగాం గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, రౌడీషీటర్ శివకుమార్ నుంచి తనకు రక్షణ కల్పించాలని రఘునాథ్‌పల్లికి చెందిన సామాజిక కార్యకర్త ఠాకూర్ జ్ఞానేష్‌సింగ్ కోరాడు. మంగళవారం పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను కలిసి వేడుకున్నాడు. జనగాం జిల్లాలో కాంగ్రెస్ నాయకుడిగా కొనసాగుతున్న పోకల శివకుమార్ రౌడీషీటర్ చేస్తున్న భూ మాఫియాతో పాటు ఇతర అరాచకాలను తాను బహిర్గతం చేయడంతో గతంలో తనపై దాడి చేశాడని పేర్కొన్నాడు. మళ్లీ ఇప్పుడు తనపై ప్రతీకారం తీర్చుకోవడానికి శివకుమార్ రాంబాబు సహకారంతో తనను చంపడానికి పథకం వేస్తున్నాడని ఆ ఫిర్యాదులో ఆరోపించాడు. తనకు ఏదైనా జరి గితే అందుకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగాం గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, రౌడీషీటర్ శివకుమార్‌లతో పాటు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్న రియాజ్‌లు బాధ్యులని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వర్షాకాలంలో నానో యూరియా వినియోగించాలి

- హన్మకొండ జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి రవీందర్ సింగ్

కాజీపేట అర్బన్ : వర్షాకాలం సీజన్‌లో రైతులు నానో యూరియా వినియోగించడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వస్తుందని హన్మకొండ జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్ తెలిపారు. మండలంలోని కడిపికొండ రైతువేదికలో మంగళవారం రైతులతో ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమానికి రవీందర్‌సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒక ఎకరానికి అర లీటర్ నానో యూరియాను పిచికారి చేయాలని సూచించారు. కాజీపేట దర్గాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎరువుల నిల్వలను, అమ్మకాలను తణిఖీ చేసి ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయాలు చేయకూడదని ఆదేశాలు జారీ చేశారు. ఏఓ సంతోష్, ఏఓలు కమలాకర్,అఫ్జల్‌పాషా.భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన నైపుణ్యాల దినోత్సవం

రామన్నపేట : నగరంలోని ఎల్‌బీ కళాశాల పదో తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ ఆర్మీ వింగ్ ఆధ్వర్యంలో కళాశాల అవరణలో మంగళవారం ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత నైపుణ్యాలను గుర్తించి వాటిని కుటుంబ, సమాజ, దేశాభివృద్ధి కోసం వాటిని మలిచినప్పుడే దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం యువతతో ప్రతిజ్ఞ చేయించారు.

సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు మంగళవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. కనీస వేతనాలు కూడా వారికి లభించటం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించేలా చర్యలు తీసుకోవాలని వీసీని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు డి తిరుపతి, కేతక ప్రసాద్, కె.ప్రశాంత్, ఆర్ నరేష్, ఆంజనేయులు ఉన్నారు.

చక్కగా చదువుకుని జీవితంలో రాణించాలి



దివ్యాంగ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

కాజీపేట : దివ్యాంగులైన విద్యార్థులు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి ప్రయత్నించాలని ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం శ్రీనాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ సొసైటీ సహకారంతో దివ్యాంగులకు నోట్‌బుక్స్, బ్యాగులు, వాటర్ బాటిల్స్ తదితర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నూగూరి చంద్ర మోహన్, ఎంఈఓ మనోజ్‌కుమార్, బి.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ పాడిశెట్టిణ వర్ధన్, కె.సునిల్ రెడ్డి, శశికిరణ్, రవి, యశోద, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌కు పోటెత్తిన మహిళలు



పోస్టాఫీసులో ఖాతా కోసం తరలివచ్చిన మహిళలు

హన్మకొండ: మహిళలు ఒక్కసారిగా పోస్టాఫీస్‌కు పోటెత్తారు. మహిళలు పెద్ద ఎత్తున పోగు కావడంతో దారిన వెళ్తున్న వారంతా ఆశ్చర్యంగా చూశారు. ఈ విషయమై 'సాక్షి' మహిళలను పలకరించగా సీఎం రేవంత్ రెడ్డి రూ.2500 ఇస్తారని కొందరు, ప్రధాన మంత్రి మోదీ రూ.2500 ఇస్తారని మరికొందరు మహిళలు తెలిపారు. పోస్టాఫీస్‌లో ఖాతా తీస్తేనే ఆ ఖాతాలో డబ్బులు జమ చేస్తారని అందుకే ఇక్కడికి వచ్చి ఖాతాలు తీస్తున్నామని చెప్పారు. మంగళవారం హనుమకొండ అంబేడ్కర్ కూడలిలోని హెడ్‌పోస్టాఫీస్ అవరణమంతా మహిళలతో కిక్కిరిసిపోయింది. ఈ విషయపై పోస్టల్ అధికారులు మాట్లాడుతూ తమకు కూడా స్పష్టంగా తెలియదని వారం రోజులు నుంచి మహిళలు వస్తున్నారని, వారిని ఖాళీగా తిరిగి పంపకుండా నిరుత్సాహానికి గురి కాకుండా ఉండేందుకు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలు తీసి పంపుతున్నామని తెలిపారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తాం

- గోపాలపురం చెరువును సుందరీకరిస్తాం
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు



ప్రజలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ సుధారాణి

హసన్‌పర్తి : చెరువు శిఖంను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వాటిని కూల్చివేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు హెచ్చరించారు. 56వ డివిజన్ గోపాలపురంలోని ఊరచెరువును మంగళవారం మేయర్ గుండు సుధారాణితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. చెరువులో శ్మశాన వాటిక నిర్మించాలని కోరారు. చెరువులో పిచ్చిమొక్కలను తొలగించి, పూడికపనులు చేపట్టాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే చెరువులో శ్మశాన వాటిక విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇప్పటికే చెరువులో పిచ్చిమొక్కలు, పూడిక తీతకు రూ.4.99 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. చెరువు కట్టను అభివృద్ధి చేయడమే కాకుండా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారిస్తామన్నారు. మురికినీరు చెరువులోకి రాకుండా ఉండేందుకు డైవర్షన్ కాల్వ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. దీని కోసం కార్పొరేషన్ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానన్నారు.

చెరువులను పరిరక్షిస్తాం : బల్దియా మేయర్

నగరంలో ఉన్న చెరువును పరిరక్షిస్తామని బల్దియా మేయర్ గుండు సుధారాణి తెలిపారు. ఇప్పటికే డ్రోన్‌ద్వారా చెరువుల సర్వే పూర్తి చేసినట్లు వివరించారు. వాటిని హద్దులు నిర్ధారిస్తామన్నారు. గోపాలపురం చెరువును సుందరీకరిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగిసునీల్‌కుమార్, ఈఈ సంతోష్‌కుమార్, డీఈఈ రవికిరణ్, ఏఈ సతీష్,ఇరిగేషన్ డీఈఈ హర్షవర్ధన్, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వాటా.. బీసీల న్యాయమైన హక్కు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



హన్మకొండ : హైదరాబాద్‌లో జరిగే బీసీ మహాధర్నాకు తరలివెళ్తున్న బీసీ నాయకులు

హన్మకొండ: జనాభా మేరకు వాటా బీసీల న్యాయమైన హక్కు అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ అన్నారు. వెనుకబడిన ప్రజాప్రతినిధుల వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన బీసీల మహాధర్నాకు బీఆర్ఎస్ బీసీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మంగళవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి వాహనాలు బయలుదేరాయి. ఈ సందర్భంగా వినయ భాస్కర్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీల ఓట్లు దండుగుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. 18 నెలలు దాటినా నేటికి బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా రేవంత్ సర్కార్ నాటకాలు ఆడుతోందని విమర్శించారు. బీసీ నాయకులు పులి రజనీకాంత్, వెంకన్న, మధుసూదన్, అశోక్ యాదవ్, రామ్మూర్తి, పాల్గొన్నారు.

హసన్‌పర్తి : మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన బీసీ మహాధర్నాకు మండల కేంద్రానికి చెందిన నాయకులు భారీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్, నరెడ్ల శ్రీధర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గండు అశోక్‌యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నన్నబోయిన కుమార్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, తదితరులు బయల్దేరారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

- మామునూరు సీఐ రమేశ్, జీడబ్ల్యూఎంసీ ఎంహెచ్ఓ రాజారెడ్డి,



మొక్కను నాటుతున్న మామునూరు సీఐ రమేశ్

మామునూరు : మొక్కల పెంపకంతోనే పచ్చదనం చేకూరి సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, పర్యావరణ పరిరక్షణ తోడ్పడుతుందని మామునూరు సీఐ రమేశ్, జీడబ్ల్యూఎంసీ ఎంహెచ్ఓ రాజారెడ్డి, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి సూచించారు. మంగళవారం వరంగల్ నగరంలోని 43 డివిజన్ వెంకటేశ్వరకాలనీలో కాలనీల డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు కర్నె రవీందర్, కాలనీ అధ్యక్షుడు నాగబండి శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను శ్రద్ధగా నీరు పోసి పెంచేందుకు కాలనీ ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. మండల పరుశరాములు, రాజ గోవిందు, కవిత, రవి, హరిప్రసాద్, రమేష్, సాంబయ్య, అశోక్ ప్రహ్లాద రావు, కుమార్ పాల్గొన్నారు.

కళాసిల్క్ చేనేత హస్తకళ మేళాకు ఆదరణ



కాజీపేట : హనుమకొండ తారా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. మేళాలో పట్టు, ఫ్యాన్సీ డిజైనర్, పోచంపల్లి చీరలు, డ్రెస్‌మెటీరియల్స్, చుడీదార్స్, సూటింగ్స్, షర్టింగ్స్, జువెల్లరీ, బెడ్ షీట్స్ అందుబాటులో ఉన్నాయి. అలాగే ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడల్లో ప్రఖ్యాతి పొందిన చీరలు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉంటుందని ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాహకులు వినోద్ నేగి కోరారు.

కోట శ్రీనివాస్‌రావుకు నివాళి

న్యూశాయంపేట : ప్రముఖ చలనచిత్ర నటుడు కోట శ్రీనివాస్‌రావు మరణించినందున మంగళవారం వరంగల్ జిల్లా కళాకారులు, కళాసంస్థల అధినేతలు కళా పోషకులతో పాటు శ్రీబాలాజీ క్రియేషన్ అధినేత డాక్టర్ ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో కోట చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మడికొండ : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కాజీపేట ఎంఈఓ బండారి మనోజ్ కుమార్ అన్నారు. మంగళవారం మడికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సహార క్లబ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హెచ్ఎం సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు గుట్కా, గంజాయి, ఆల్కహాల్, సిగరెట్, తీసుకోవడం ద్వారా అనేక ఇబ్బందులకు గురవుతారని అన్నారు.

ప్రమాద బాధితులను ఆదుకోవాలి

కాజీపేట : సిగాచి ఫ్యాక్టరీ ప్రమాదంలో బాధిత కుటుంబాలకు తక్షణమే ప్రభుత్వం పరిహారం అందించాలని హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మంగళవారం డిమాండ్ చేస్తూ సీఐటీయూ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేట్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు

హన్మకొండ అర్బన్ : ఇటీవల హనుమకొండ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రవీందర్‌రెడ్డిని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కలిసిన వారిలో డిప్యూటీ తహసీల్దార్ రంజిత్, ఎంఆర్ఐ దశరథరామ్‌రెడ్డి, రేషన్ డీలర్ల సంఘం నేతలు ఉన్నారు.

ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

కాజీపేట అర్బన్ : కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం వీహెచ్‌పీఎస్, ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్‌మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి సోమన్న పాల్గొని మాట్లాడారు.

వ్యక్తిగత భద్రత పాటిస్తూ విధులు నిర్వహించాలి

కాజీపేట అర్బన్ : మున్సిపల్ కార్మికులు వ్యక్తిగత భద్రత పాటిస్తూ విధులు నిర్వహించాలని 44వ డివిజన్ కార్పొరేటర్ అనితరంజిత్ తెలిపారు. మండలంలోని భట్టుపల్లిలో మంగళవారం మున్సిపల్ కార్మికులకు పీపీఈ కిట్లను అందజేసి మాట్లాడారు.

హసన్‌పర్తి : 66వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం కార్పొరేటర్ శివకుమార్ ఆరోగ్యకిట్లు పంపిణీ చేశారు.

'పల్లెపాడు'కు ఇండియన్ అచీవర్ అవార్డు



హన్మకొండ: సామాజిక సేవకు సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్‌కు జాతీయస్థాయి గుర్తింపు లభించింది. 30 ఏళ్లుగా రాష్ట్రంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి దామోదర్‌కు ఇండియన్ అచీవర్ అవార్డు అందుకున్నారు. మంగళవారం న్యూ ఢిల్లీలోని హోటల్ లి మెడీరియన్‌లో 12వ సీఎస్ఆర్ సమ్మిట్ మిషన్ వికసిత్ భారత్–2047 కార్పొరేట్ సామాజిక బాధ్యత పాత్ర అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సులో దామోదర్‌ను ఇండియా అచీవర్ అవార్డుకు ఎంపిక కాగా రువాండ హై కమిషనర్ మిస్ జక్వాలిన్ మూకాంగిరా, వియత్నాంకు ట్రేడ్ కౌన్సిలర్ బుయిట్రన్ థాంగ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అవార్డు రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు.

సంక్షిప్త సమాచారం

పీహెచ్‌డీ రెన్యువల్ ఫీజు తగ్గించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల పీహెచ్‌డీ అభ్యర్థులకు పెంచిన రెన్యువల్ ఫీజును తగ్గించాలని అలాగే ఫీజు చెల్లించేందుకు గడువును పెంచాలని పలువురు పరిశోధకులు మంగళవారం కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

ఫార్మసీ రంగంలో విస్తృత అవకాశాలు

హన్మకొండ: ఫార్మసీ రంగంలో విస్తృత అవకాశాలు న్నాయని, విద్యార్థులు తమ ప్రతిభ, నైపుణ్యంతో అవకాశాలు అందిపుచ్చుకోవాలని అమెరికా శాస్త్రజ్ఞుడు డాక్టర్ చంద్ర గోపారాజు అన్నారు. మంగళవారం విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాలలో కళాశాల స్నాతకోత్సవం జరిగింది. కార్యక్రమంలో కేయూ ప్రొఫెసర్ జె.కృష్ణవేణి, గోపరాజు ముఖ్య అతిథిగా పాల్గొని బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఫాం–డీ విద్యార్థులకు పట్టాలు అందించారు.15హెచ్ఎంకెడి 59 : పోస్టాఫీస్‌లో ఖాతా కోసం తరలివచ్చిన మహిళలు

గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి

కాజీపేట అర్బన్ : గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధిలోని సుర్జీత్‌నగర్‌లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలకు పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా సభ్యుడు చుక్కయ్య డిమాండ్ చేశారు. తహసీల్దార్ బావుసింగ్‌కు మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేసి చుక్కయ్య మాట్లాడారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విద్యారణ్యపురి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో కలిసి పోస్టుకార్డులు సీఎం రేవంత్‌రెడ్డికి పంపినట్లు మంగళవారం పీడీఎస్‌యూ తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి తెలిపారు. విద్యారంగంపై నిర్లక్ష్యం వహిస్తే గత కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందన్నారు.

శ్వేతార్కుడికి విభూధితో అభిషేకం

కాజీపేట : స్థానిక స్వయంభు శ్రీశ్వేతార్కమూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం విభూధితో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ దేవి ఉపాసకులు గంగు సత్యం పండితులు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

కాజీపేట : నిరుపేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ అన్నారు. 63వ డివిజన్ తిలక్‌నగర్ కాలనీలో మంగళవారం రూ.25 లక్షలతో చేపట్టిన సైడ్ డ్రెయినేజీ పనులను ఆమె ప్రారంభించారు. మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి జేసీబీ సాయంతో పనులు మొదలు పెట్టారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పోగుల సంతోష్, క్రాంతి భరత్, ఎండి షబ్బీర్, నర్సింగరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులు షురూ

కాజీపేట అర్బన్ : గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు మంగళవారం కార్పొరేటర్ మామిండ్ల రాజు శ్రీకారం చుట్టారు. పాఠశాల ఆవరణలో జేసీబీతో శుభ్రం చేసి విద్యార్థులు అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేందుకు ప్రకృతివనంతో పాటు ఆటలకు అనుకూలంగా ఉండేందుకు గ్రౌండ్ నిర్మాణం చేయనున్నట్లు రాజు తెలిపారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

ఖిలా వరంగల్ : రోటరీ క్లబ్ వరంగల్ సెంట్రల్ సేవలు అభినందనీయమని క్లబ్ అధ్యక్షుడు మదూరి గణేష్ కుమార్, కార్యదర్శి పొన్న హరినాథ్ అన్నారు. మంగళవారం వరంగల్ సాయినగర్ కాలనీలో రోటరీక్లబ్ వరంగల్ సెంట్రల్ 37వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. రోటరీ గవర్నర్ ఉదయ్ ఫిలాది, డాక్టర్ శరత్ బాబు, ఎస్.నరేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గణేష్ కుమార్, కార్యదర్శిగా హరినాథ్, కోశాధికారి బండారి కుమార్ ఎన్నికైనట్లు తెలిపారు.

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో మంగళవారం రాత్రి జీసస్ ప్రేయర్ హాల్ ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్, జీసస్ ప్రే యర్ హాల్ ఫౌండర్ మరియదాస్‌లు కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట, రైల్వే స్టేషన్ నుంచి చౌరస్తా వరకు సంచారం చేసే నిరుపేదలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, క్రిష్టఫర్, సూరయ్య సంజీవ, రాజేంద్రప్రసాద్, కృష్ణకుమార్, పాల్గొన్నారు.